


ఆధార్ కేంద్రం పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని రవ్వారం సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను డీఎల్‌డీవో వెంకటరెడ్డి, ఎంపీడీవో టి.వీరభద్రాచారి పరిశీలించారు.



దుర్గమ్మ సేవలో మంత్రి అనగాని

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గురువారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1416 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 356 క్యూసెక్కులు వదిలారు .

కాల కూటమి విషం

ప్రజా పాలనకు రాష్ట్ర సర్కార్ చరమగీతం

- సచివాలయ, రైతుభరోసా, హెల్త్‌క్లినిక్ భవనాల నిర్మాణాలు నిలిపివేత
- గత ప్రభుత్వంలో రూ. 288.31 కోట్లతో 572 పనులు
- రూ. 182కోట్లతో 311 పనులు పూర్తి
- రూ. 106 కోట్ల విలువైన 261 పనులు నిలిపేసిన చంద్రబాబు ప్రభుత్వం
- సచివాలయ వ్యవస్థకు మంగళం పాడే ఎత్తుగడ
- వైఎస్.జగన్ పాలన గుర్తుకు రాకుండా చేసే కుట్ర
- లంచాల పాలనకు నాంది పలుకుతున్న కూటమి ప్రభుత్వం

సచివాలయాలు, ఆర్బీకేలతో అవినీతిరహిత పాలనను ప్రజల ముంగిటకు తెచ్చి మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం స్థాపించింది. ప్రభుత్వ సేవల్ని పారదర్శకంగా అందించింది. ప్రజల నుంచి మన్నన పొందిన వ్యవస్థలను కూకటి వేళ్లతో పెకలించి, తిరిగి పేదలకు లంచాలతో కూడిన పాత వ్యవస్థను కట్టబెట్టేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సదాశయంతో నెలకొల్పిన సచివాలయ, రైతుభరోసా, హెల్త్ వెల్‌నెస్ వ్యవస్థలపై కక్ష కట్టింది. భవనాల నిర్మాణ పనుల్ని ఎక్కడికక్కడ నిలిపి వేయాలని అధికారుల్ని ఆదేశించడంతో మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి.



పొన్నపల్లిలో కూటమి ప్రభుత్వం నిలిపి వేసిన సచివాలయం, రైతు భరోసా భవనాలు



కూటమి ప్రభుత్వంలో ఇంకా పూర్తి కాని వేటపాలెం 1 సచివాలయం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: సచివాలయ వ్యవస్థ రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వివిధ దశల్లో ఉన్న సచివాలయ, రైతుభరోసా, హెల్త్‌వెల్‌నెస్ సెంటర్స్ భవనాల నిర్మాణాల్ని నిలిపి వేసింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలిచ్చింది. గత ప్రభుత్వంలో పేదలకు ఇంటిముంగిట సేవలందించిన వ్యవస్థలపై కక్ష కట్టి రూపుమాపేందుకే ఆయా భవనాల నిర్మాణ పనుల్ని నిలిపి వేసినట్లు తెలుస్తోంది. వీటిని కొనసాగిస్తే ప్రజలకు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన గుర్తుకు వస్తుందని, దాన్ని అడ్డుకునేందుకు భవన నిర్మాణాల్ని నిలిపివేసినట్లు టీడీపీ వర్గాల నుంచే గుసగుసలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో రూ. 288.31 కోట్లతో 572 పనుల్ని చేపట్టారు. ఇందులో రూ. 182కోట్లతో 311 పనులు పూర్తి చేశారు. ఇప్పుడు రూ. 106 కోట్ల విలువైన 261 పనుల్ని చంద్రబాబు ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపి వేసింది. కూటమి ప్రభుత్వం అన్నివర్గాల వారికి సేవలందించిన సచివాలయ పాలనను నిలిపివేస్తే సహించేది లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ పాలనలో నిర్మాణాలు ఇలా

271 సచివాలయాలు నిర్మాణం

వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 25 మండలాల పరిధిలో 271 గ్రామ సచివాలయాల నిర్మాణం చేపట్టింది. ఇందుకోసం రూ.154.63 కోట్లు కేటాయించింది. ఐదేళ్ల పాలన ముగిసేనాటికి 166 సచివాలయాల నిర్మాణం పూర్తిచేసింది. రూ. 107 కోట్లుకు గాను రూ. 85 కోట్లు చెల్లించింది. ఇంకా రూ. 21 కోట్లు ఇవ్వాల్సి ఉంది. మిగిలిన 105 సచివాలయాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

148 రైతుభరోసాల నిర్మాణం

జిల్లావ్యాప్తంగా రూ. 70.62 కోట్లతో 148 రైతుభరోసా కేంద్రాల నిర్మాణం చేపట్టగా పాలన ముగిసేనాటికి రూ.40 కోట్లతో 84 భవనాలు పూర్తి చేశారు. 64 భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి.



ఉప్పమాగులూరు-2లో అసంపూర్తి పనులతో వినియోగంలో లేని ఆర్బీకే

153 హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్

రూ. 63 కోట్లతో 153 హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్‌ని ర్మాణం చేపట్టగా పాలన ముగిసే నాటికి నాలు భవనాలు పూర్తికాగా, 82 భవనాల నిర్మాణ పనులు శ్లాబుబ్ దశల్లో ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

వ్యవస్థలను కొనసాగించాలి



ప్రజలకు అవినీతి రహిత పాలనను అందించే దిశగా గత ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాల్ని కూటమి ప్రభుత్వం కొనసాగించాలి. ప్రజాసంక్షేమం కోసం నిర్మాణాలలో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను పూర్తి చేయాలి. సచివాలయాలతో గ్రామ స్థాయిలో పారదర్శకంగా సేవలు అందుతున్నాయి. రైతుభరోసా కేంద్రాలతో రైతులకు అనేక సేవలు వారి గ్రామాల్లో అందుతున్నాయి. ఈ వ్యవస్థలను కొనసాగించాలి.

– కరణం వెంకటేష్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, చీరాల

అర్ధంతరంగా ఆపివేయడం అమానుషం



ప్రభుత్వ సేవల్ని ప్రజలకు చేరువ చేయటంతో పాటు అవినీతిరహిత పాలన అందించే దిశగా గత ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత కూటమి ప్రభుత్వం విస్మరిస్తోంది. గ్రామీణ స్థాయిలోనే రైతులకు సేవలను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. ప్రస్తుత ప్రభుత్వం నిర్మాణంలో ఉన్న వందలాది సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలను అర్ధంతరంగా ఆపివేయడం అమానుషం. నిర్మాణాలలో ఉన్న భవనాలను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలి.

– మోపిదేవి వెంకట రమణారావు, రాజ్యసభ సభ్యుడు, రేపల్లె

సేవల్ని కొనసాగించాలి



వైఎస్సార్ సీపీ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందాయి. ప్రజల ముంగిట్లోకి ప్రభుత్వ పాలన వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం నిర్మాణాలను అర్ధంతరంగా ఆపేయడం సబబు కాదు. నిర్ణయాన్ని వెంటనే మార్చుకోవాలి. గ్రామాల్లో మధ్యలో ఆగిపోయిన నిర్మాణాల్ని వెంటనే పూర్తి చేయాలి.

– గరిక రమేష్, కొల్లూరు

సచివాలయ వ్యవస్థ తొలగించడం సరికాదు



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటుచేసి పైసా లంచం లేకుండా అన్నివర్గాలవారికి సేవలందించింది. రైతుభరోసాలు పెట్టి రైతులకూ మంచి చేసింది. ఇప్పుడొచ్చిన ప్రభుత్వం వాటిని కొనసాగించి సేవలు అందించాలి. గత ప్రభుత్వం నిర్మిస్తున్న భవనాలను నిలిపి వేయడం సరికాదు. వాటిని పూర్తిచేసి అందరికీ సేవలందించాలి.

– ఎం. శ్రీనివాసరెడ్డి, వల్లాపల్లి, బల్లికురవ మండలం

న్యూస్‌రీల్

29న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 29న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీ చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరూ కార్యక్రమానికి విధిగా హాజరుకావాలని కోరారు. ఫిర్యాదులుంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతోపాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరయ్యే వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు కూడా చేయవచ్చని తెలిపారు. గుంటూరు అరండల్‌పేట 10వ లైనులోని డీసీబీఓ, ఈఎస్ఐసీ కార్యాలయం, కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్సార్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా కొండపి మండలం కె.ఉప్పలపాడులోని పాపారావు పబ్లిక్ స్కూల్, విజయవాడ గాంధీనగర్‌లోని ఈఎస్ఐసీ శాఖ కార్యాలయం, బాపట్ల జిల్లా రేపల్లెలోని ఎస్ఎన్బీటీ మహిళా డిగ్రీ కళాశాల, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శ్రీరాఘవేంద్ర బాలకుటీర్ హైస్కూలులో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కమిషనర్ సూచించారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏప్రిల్‌లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల 2వ సెమిస్టర్ ఫలితాలను గురువారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9,792 మంది హాజరు కాగా వారిలో 5,670 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాశరావు మాట్లాడుతూ డిగ్రీ పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ వెబ్సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూ.ఏసీ.ఇన్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు ఆగస్టు 8వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1,240 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పర్సనల్ వెరిఫికేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.1260 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారు ఆయా కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా వర్సిటీ డిగ్రీ పరీక్షల కో-ఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య సంధ్య కోలే, సీటీఏ ప్రొఫెసర్ సత్యనారాయణ, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ భవిత, డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

వాసవీమాతకు ఆషాఢ సారె



తెనాలి: వాసవీ క్లబ్ వనిత ఆంధ్రాప్యారిస్, తెనాలి ఆధ్వర్యంలో గురువారం వాసవీ మాతకు భక్తులు ఆషాఢ మాస సారెను సమర్పించారు. పట్టణ బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సాయంత్రం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారికి సారెను సమర్పించారు. వాసవీ క్లబ్ వనిత సభ్యులు, పట్టణ ఆర్యవైశ్య మహిళలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గంగిశెట్టి లీలారాణి, గొల్లపూడి అనూరాధ వెల్లడించారు. కోశాధికారి వక్కలగడ్డ విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు తాళ్లూరి గాయత్రి, సంయుక్త కార్యదర్శులు కొత్తమాసు పద్మావతి, గంగిశెట్టి లక్ష్మి పాల్గొన్నారు.

యార్డులో 44,403 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 40,010 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 44,403 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకానికి రూ. 9,000 నుంచి రూ. 17,000 వరకు లభించింది.

కార్గిల్‌లో పేలిన చందోలు రైఫిల్

- కార్గిల్ యుద్ధంలో గ్రామానికి చెందిన హాజీ బాషా మృతి
- నేడు కార్గిల్ దినోత్సవం సందర్భంగా హాజీ బాషాకు ఘన నివాళి
- దేశసేవకు ఎందరో సిపాయిలను అందించిన చందోలు



చందోలు గ్రామ ముఖ చిత్రం

చందోలు (పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలు నుంచి ఎందరో యువకులు సైన్యంలో చేరి సిపాయిలుగా సేవలందించారు. దేశమాత రక్షణకు ప్రాణాల్ని తృణ ప్రాయంగా అర్పించారు. అటువంటి వీర యువకుల్లో హాజీ బాషా ఒకడు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొంది రెండు దశాబ్దాలు అయినా గ్రామస్తుల గుండెల్లో నిలిచిపోయాడు.అతడి త్యాగం,ధైర్యం భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచింది. మండలంలోని చందోలులో అబ్దుల్ రెహ్మన్, ముంతాజ్ బేగంలకు 1975 సంవత్సరంలో హాజీ బాషా జన్మించాడు. పెద్దల స్ఫూర్తితో ఇరవై ఏళ్ల వయసులోనే అంటే 1993లో సైన్యంలో చేరాడు. 110 ఇంజినీర్ రెజిమెంట్ బొంబాయి గ్రూపులో 17వ బెటాలియన్ గార్విల రైఫిల్స్‌లో పనిచేశాడు. ఆపరేషన్ విజయ్ పేరుతో జరిగిన కార్గిల్ పోరాటంలో వీరమరణం పొందాడు. అతడి తండ్రి రెహ్మన్ కుమారుని మరణంతో దిగులు చెంది మంచాన పడి ఏడాదిలోపే మరణించాడు. హాజీబాషా తమ్ముడు ఎనిమిదేళ్ల వయసులోనే మొదడు వాపు వ్యాధితో చనిపోయాడు.

సిపాయిలకు పుట్టినిల్లు చందోలు

పిట్టలవానిపాలెం మండలం చందోలు సిపాయిలకు పుట్టిల్లుగా చెప్పవచ్చు. గ్రామం నుంచి వందలాది మంది దేశసేవ కోసం సిపాయిలుగా పని చేశారు. ప్రస్తుతం చేస్తున్నవారు అనేక మంది ఉన్నారు. గ్రామానికి చెందిన వారు మొదటి ప్రపంచ యుద్ధంలో కూడా పాల్గొన్నారు. సిపాయి స్థాయి నుంచి హవల్దార్, నాయక్, మేజర్ లాంటి హోదాలలో పని చేసిన వారూ ఉన్నారు. ఇప్పటికే పదవీ విరమణ చేసి గ్రామంలో ఉన్నవారు వందల సంఖ్యలో ఉన్నారు.అంతేకాక దాదాపుగా ప్రతి ఇంటి నుంచి ఆర్మీలో పనిచేస్తున్న వారు ఉన్నారంటే ఆశ్చర్యపోక తప్పదు. ఇప్పటికీ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ రాష్ట్రంలో ఎక్కడ జరిగినా అధిక శాతం మంది చందోలు యువకులే ఉంటారు.



హాజీ బాషా(ఫైల్)

వాగ్దానం మరచిన పాలకులు

దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన హాజీ బాషాకు గ్రామంలో స్మారక స్థూపం నిర్మిస్తామని అప్పట్లో పాలకులు హామీ ఇచ్చారు.అయితే, 20 ఏళ్లు పూర్తయినా నేటికీ అది నెరవేరలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి స్మారక స్థూపం నిర్మించి, కార్గిల్ వీరునికి నిజమైన నివాళులర్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హాజీ బాషా త్యాగం మరువలేనిది



హాజీ బాషా త్యాగం మరువలేనిది. భావి తరాలకు స్ఫూర్తిగా అతడి విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేయడం అవసరం. ఇప్పటికైనా హామీని నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

–రియాజ్, చందోలు

నీటి పథకానికి బాషా పేరు పెట్టాలి



కార్గిల్ వీరుడు హాజీ బాషా పేరును రక్షిత మంచినీటి పథకానికి పెడతామని అప్పట్లో హామీ ఇచ్చారు.అయితే నేటి వరకు దాని ఊసే లేదు. పాలకులు ఇప్పటికైనా స్పందించాలి.

– మస్తాన్ బేగ్, చందోలు

సారె సమర్పణకు తరలివచ్చిన భక్తులు

విజయవాడ: ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు గురువారం పలు భక్త బృందాలు సారెను సమర్పించాయి. విజయవాడతో పాటు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి పెద్దఎత్తున భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలి వచ్చాయి. అమ్మవారికి సారెను సమర్పించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం రాజగోపురం సమీపంలోని లక్ష కుంకుమార్చన వేదిక వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. సారె సమర్పించేందుకు వచ్చిన భక్తులను ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు.



పట్టణ ప్రజలందరికీ శుద్ధ జలాల సరఫరా

కలెక్టర్ జె.వెంకట మురళి



తాగునీటిని పరీక్షలకు పంపుతున్న కలెక్టర్

బాపట్ల: పట్టణ ప్రజలందరికీ శుద్ధ జలాల్ని సరఫరా చేయాలని కలెక్టర్ జె. వెంకట మురళి అధికారుల్ని ఆదేశించారు. బాపట్ల పట్టణంలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ గురువారం విస్తృతంగా పర్యటించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, నూతన ఎస్ఎస్ ట్యాంక్ ప్రతిపాదిత స్థలం, శుద్ధ జల కేంద్రం, తాగునీటి సరఫరా విభాగం, మురుగునీటి కాలువలు, డంపింగ్ యార్డ్, పారిశుద్ధ్య కార్యక్రమాలు, సంజయ్ గాంధీ కాలనీ, కలెక్టరేట్‌లోని పోలీస్ కవాతు మైదానం, తదితర ప్రాంతాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాపట్ల ప్రజల తాగునీటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. కొండుబొట్లపాలెం సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు (చెరువు) సామర్థ్యం 860 మిలియన్ లీటర్లు కాగా ప్రస్తుతం ఎనిమిది అడుగుల మేర బురద మేట వేసిందని చెప్పారు. 100 ఎకరాలలో విస్తరించి ఉన్న ట్యాంకులో పూడికతీత పనులు చేపట్టాలంటే ప్రత్యామ్నాయంగా రెండోది లేదన్నారు. సమీపంలోనే 100.8 ఎకరాల స్థలంలో నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. పట్టణ ప్రజలకు రెండు నెలలకు సరిపడా నీరు ఉందని, ఎలాంటి సమస్య లేదన్నారు. అనంతరం తాగునీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పోలీస్ కవాతు మైదానంలో నిర్వహించడానికి నీరు నిల్వ లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభం

పట్టణంలో అన్న క్యాంటీన్లను ఆగస్టు 15 నుంచి తెరిచేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని బాపట్ల, చీరాల, రేపల్లె, అద్దంకి పట్టణ ప్రాంతాలలో క్యాంటీన్లను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ఆగస్టు రెండో తేదీ నాటికి నిర్మాణ పనులన్నీ పూర్తిచేసి ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట బాపట్ల ఆర్డీఓ జి. రవీందర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, డీఈ శ్రీనివాసరావు ఉన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ అభినందనీయం

టెట్-డీఎస్సీలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు శ్రీభావపురి విద్యాసంస్థలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. ఉచిత శిక్షణ కరపత్రాల్ని ఆయన కలెక్టరేట్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 27 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు ఆరు రోజులు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీలతో శిక్షణ ఉంటుందని విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు.

పొదుపు గ్రూపుల బలోపేతమే లక్ష్యం

జిల్లా వెలుగు ప్రాజెక్టు ఏజీఎం నాగబాబు

బల్లికురవ: గ్రామైక్య సంఘాలు, పొదుపు గ్రూపు సభ్యుల్ని ఆర్థికంగా బలోపేతంతో లక్షాధికారుల్ని చేయాలని వెలుగు ప్రాజెక్టు బాపట్ల జిల్లా ఏజీఎం నాగబాబు సూచించారు. బల్లికురవలోని వెలుగు కార్యాలయంలో గురువారం మండలంలోని 42 గ్రామైక్య సంఘాలతో మండల సమాఖ్యల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఏపీఎం సురేంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ పొదుపు గ్రూపులకు రూ.3 లక్షల వరకు ఉన్న రుణాన్ని రూ.5 లక్షల వరకు పెంచారని తెలిపారు. ఈ ఏడాది మండలానికి రూ.7.5 కోట్లు స్త్రీనిధి రుణాల్ని కేటాయించామని, బ్యాంకుల వారీగా గ్రూపు సభ్యులకు అందజేస్తామని ఏపీఎం వివరించారు. సమావేశంలో ఉన్నతి స్త్రీనిధి ఏపీఎంలు రామకృష్ణ, రమేష్, స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్, సీసీలు పేరయ్య, విజయరాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు


పొక్లెయిన్‌కు అడ్డుగా నిలిచిన గ్రామస్తులు

టీడీపీ సానుభూతిపరుడి దుశ్చర్య

అద్దంకి: మండలంలోని కలవకూరు గ్రామ చెరువులో టీడీపీ సానుభూతి పరుడి మట్టి తవ్వకాల్ని గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. గతంలోనూ అడ్డుకుని నిలుపుదల చేసినట్లు మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. కలవకూరులో 202 ఎకరాల్లో సాగు నీటి చెరువు ఉంది. దాని కింద 400 ఎకరాల మాగాణి సాగవుతోంది. అయితే, చెరువులో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలతో నీటి నిల్వలు గోతులకే పరిమితమవుతున్నాయి. చెరువు నుంచి వేసిన మూడు తూములు పని చేయక సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సానుభూతిపరుడు చిరంజీవి చెరువులో పలుమార్లు పొక్లెయిన్ పెట్టి టిప్పర్లతో మట్టిని తరలించడం సరికాదని వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. అక్రమ తవ్వకాలపై తహసీల్దార్‌కు, వీఆర్వోకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. మట్టి తోలుతున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పంచాయతీలకు ఆదాయంతోనే అభివృద్ధి

మేదరమెట్ల: పంచాయతీలకు ఆదాయంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, రావినూతల పంచాయతీ కార్యాలయాల్ని గురువారం ఆయన పరిశీలించారు. మేదరమెట్ల గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి, పొడి చెత్తల తేడాల్ని ప్రజలకు వివరిస్తూ అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించాలని సూచించారు. రావినూతల సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈవోలు లక్ష్మీకాంత్, శ్రీనివాసరావు, ఈపీవోఆర్డీ ఓబులేసు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


మేదరమెట్లలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో రవికుమార్

చితికిన

చేనేత బతుకులు

ఆధునిక యంత్ర కోరలకు చేనేత బతుకులు ఛిన్నాభిన్నమయ్యాయి. అటు కులవృత్తిని వదులుకోలేక, ఇటు కొత్త పనులు చేయలేక నేతన్న సతమవుతున్నాడు. కుటుంబమంతా కలిసి రోజంతా పని చేసినా పూట గడవని దుస్థితి. చెమటోడ్చి నేసిన వస్త్రాలను అమ్ముకుందామంటే కొనే నాథుడు లేడు. అదుకోవాల్సిన సర్కారు చేయూతనివ్వడం లేదు. చేనేత వస్త్రాల్ని కొనుగోలు చేయాల్సిన ఆప్కో రెండేళ్లుగా మొహం చాటేసింది. ఫలితంగా నేతన్న పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పేరిట ఆదుకొంది. ప్రస్తుతం పథకంపై నీలినీడలు కమ్ముకోవడంతో చేనేత బతుకులు చితికిపోతున్నాయి.

- చేనేత వస్త్రాలు కొనుగోళ్లు నిలిపివేత
- కొనుగోళ్లకు ముందుకురాని ఆప్కో
- కార్మికులకు పని ఇవ్వని మాస్టర్ వీవర్స్
- చేయూతనివ్వని బాబు సర్కారు
- నేతన్న నేస్తం అమలు చేయాలని కోరుతున్న చేనేతలు

చీరాల: రోజుంతా కష్టపడి నేతన్న నేసిన వస్త్రాల్ని అమ్ముకుందామంటే మార్కెట్ లేదు. కొనుగోలు చేయాల్సిన ఆప్కో ముందుకు రావడం లేదు. ఫలితంగా చేనేతల తయారు చేస్తున్న వస్త్రాలు కొనుగోలు చేసే నాథుడు లేక కొట్లాది రూపాయల నిల్వలు పేరుకుపోయాయి. మగ్గం మూలన పడింది. వస్త్రాలు నేయడం తప్పా మరో పని తెలియని చేనేత కార్మికులు కొందరు మట్టి పనులకు వెళుతున్నారు. మరికొందరు పస్తులతో జీవన పోరాటం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వం 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పేరుతో మగ్గం ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి రూ. 24 వేలు చొప్పున సహకారం అందించింది. దీంతో చేనేత కుటుంబాలు అవసరాలు తీర్చుకోగా, మరికొందరు వారి బిడ్డల చదువులకు ఉపయోగించేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో పథకం అమలుపై సందేహం నెలకొంది. ప్రభుత్వం కూడా దీనిపై ప్రకటన చేయకపోవడంతో నేతన్నలు ఆందోళన చెందుతున్నారు. పూట గడవక కష్టాల్లో ఉన్న తమకు 'వైఎస్సార్ నేతన్న నేస్తం' చేదోడువాదోడుగా ఉందని పేర్కొంటున్నారు.

కనిపించని ఆప్కో

చేనేతలు మగ్గాలపై తయారుచేసే వస్త్రాలను ప్రభుత్వ సంస్థ ఆప్కో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం కూడా ఏటా కొనుగోలు కోసం నిధులిస్తుంటుంది. వీటితో ఆప్కో ప్రభుత్వ అవసరాలకు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కొనుగోలు చేయాలి. మిగిలిన వస్త్రాలను సేల్స్ ఎగ్జిబిషన్‌లను రాష్ట్రమంతా ఏర్పాటు చేసి సబ్సిడీ రేట్లకు అమ్ముతుంది. తద్వారా చేనేత వస్త్రాలు నిల్వలేకుండా అమ్ముడవుతాయి. చేనేత కార్మికులకు రోజంతా పనిదొరుకుతుంది. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉంది. ఆప్కో చేనేత వస్త్రాలు కొనుగోలు చేయడం నిలిపివేసింది. దీంతో మాస్టర్ వీవర్స్ కార్మికులకు పని ఇవ్వడం లేదు. ఇంట్లో పనిలేక బయట పనులకు వెళ్లలేక నానా ఆగచాట్లు పడుతున్నారు. ఒక్క చీరాల్లో రూ. 5కోట్ల చేనేత వస్త్రాలు పేరుకుపోయాయి.

గత ఐదేళ్లలో నేతన్న నేస్తం అమలు ఇలా...

సంవత్సరం	లబ్ధిదారులు	అందించిన సాయం
2019-20	7780	రూ.18.67 కోట్లు,
2020-21	7590	రూ.18.29 కోట్లు,
2021-22	7700	రూ.18.64 కోట్లు
2022-23	8286	రూ.19.89 కోట్లు
2023-24	8505	రూ.20.89 కోట్లు
	40,125	రూ.96.35 కోట్లు

భారంగా మారిన జీఎస్టీ

చేనేతల పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడినట్లుంది. చేనేత వస్త్రాలకు వినియోగించే చిలప నూలుపై కేంద్రం జీఎస్టీ విధించింది. దీంతో చిలప నూలు, పట్టు, జరీ ధరలు రెట్టింపయ్యాయి. మార్కెట్‌లో చేనేత వస్త్రాల పేరుతో మర మగ్గాలపై తయారైన వస్త్రాలు రాజ్యమేలుతున్నాయి. ఒక్క చీరాలలోనే మాస్టర్ వీవర్స్ వద్ద రూ. 50 కోట్ల విలువైన వస్త్రాలున్నాయి. జిల్లా మొత్తం మీద ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో చీరాల, వేటపాలెం, చెరుకుపల్లి, రేపల్లె, భట్టిప్రోలు, మార్టూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల్లో చేనేత కార్మికులున్నారు. మాస్టర్ వీవర్ల వద్ద చేనేత ఉత్పత్తులు పేరుకుపోవడంతో వీరి కింద పనిచేసే చేనేత కార్మికులకు పని ఇవ్వడం నిలిపివేశారు.

మొక్కుబడిగా 'షో'సైటీలు

ప్రభుత్వం నుంచి సబ్సిడీపై నూలు, రంగు, రసాయనాలు తక్కువ వడ్డీలకు పెట్టుబడులు పేరుతో రుణాలు పొంది కార్మికులకు పనులు కల్పించాల్సిన చేనేత సహకార సంఘాలు అవినీతి, నిర్వహణ లోపతో నిర్వీర్యం అయ్యాయి. వీటి కింద పనిచేసే కార్మికులు తయారు చేసిన ఉత్పత్తులు రూ.3 కోట్లు మేర నిల్వ ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అవినీతి, ఆరోపణలు ఎదుర్కొంటు సంఘాలపై విచారణ సక్రమంగా జరగడం లేదు. చీరాల్లో నడుస్తున్న జిల్లా చేనేత కార్యాలయంలో ఏడీ, డీఓ, ఏడీవో ఇతర సిబ్బంది 20 మందికి గానూ ఎనిమిది మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగతావి ఖాళీగా ఉండటంతో కార్యాలయ పనితీరు మొక్కుబడిగా సాగుతోంది. బాపట్ల జిల్లాగా మారిన తరువాత ఐదుగురు ఏడీలు మారినా పాలన అస్తవ్యస్తంగా మారింది. దాన్ని గాడిలో పెట్టాలని నేతన్నలు కోరుతున్నారు.


మగ్గం నేస్తున్న చేనేత కార్మికురాలు

చేనేతలను ఆదుకోవాలి



వ్యవసాయరంగం తర్వాత రెండో అతి పెద్ద రంగమైన చేనేత రంగం మరణశయ్య మీద ఉంది. కార్మికులు పూటగడవని పరిస్థితుల్లో ఉన్నారు. గతంలో ఆదుకున్న నేతన్న నేస్తం పథకం మళ్లీ కొనసాగిస్తారో...లేదో...? అని ఎదురు చూస్తున్నాం. వృత్తిని ఒదిలి చాలామంది ఇతర పనులకు వెళ్తున్నా మనుగడ కష్టంగా ఉంది. నిర్వీర్యమైన చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేయాలి. పేరుకుపోయిన వస్త్ర నిల్వల్ని కొనుగోలు చేయాలి. చేనేతరంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పాలకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలి.

– జి.సుబ్బారావు, చేనేత కార్మికుడు

మత్తుపదార్థాల విక్రేతలు ఇద్దరు అరెస్ట్

రూ.25వేల విలువైన ఎండీఎంఏ స్వాధీనం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మత్తు పదార్థాలు విక్రయించే ఇద్దరు యువకులను ఎస్ఈబీ (సెబ్) గుంటూరు-1 స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.25 వేలు విలువ చేసే ఎండీఎంఏ మత్తు పదార్థం, ఒక ద్విచక్ర వాహనం, రెండు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సెబ్-1 స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను సీఐ పి.విజయకుమార్ వెల్లడించారు. ఎస్పీ సతీష్‌కుమార్, సెబ్ ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, ఈఎస్ ఎల్.రంగారెడ్డి పర్యవేక్షణలో ముందస్తు సమాచారంతో గురువారం సాయంత్రం అనంతవరప్పాడురోడ్డులోని మారుతీటౌన్ షిప్ ప్లాట్‌లోని వాటర్ ప్లాంట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏటీఅగ్రహారానికి చెందిన అంకాల వినయ్, షేక్. రోషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీలు చేయగా రూ.25 వేలు ఖరీదు చేసే ఐదు గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థం లభ్యమైంది. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేశారు. మత్తు పదార్థంతోపాటు ఒక మోటారుసైకిల్, రెండు మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుళ్లు పి.వి.పోతురాజు, ఎం.లక్ష్మణరావు, పి.సురేష్‌బాబు (సెబ్), పీసీలు కె. నాగరాజు, ఎల్.కోటేశ్వరరావు (సెబ్) పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సెబ్ గుంటూరు-1 స్టేషన్ సీఐ విజయకుమార్

మత్తుకు అలవాటు పడి..

ఏటీఅగ్రహారానికి చెందినన అంకాల వినయ్, షేక్ రోషన్ ఇద్దరు మిత్రులు. డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్ కోర్సుల్లో తర్ఫీదు పొందుతున్నారు. మత్తుకు అలవాటుపడిన వినయ్ సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో రోషన్‌తో జతకట్టాడు. దీంతో వినయ్ రైల్లో హైదరాబాద్‌కు వెళ్లి బలరాం అనే వ్యక్తి వద్ద ఎండీఎం మత్తు పదార్థం కొనుగోలు చేసేవాడు. అనంతరం దాన్ని గుట్టుచప్పుడు కాకుండా గుంటూరు తీసుకొచ్చి, తెలిసిన వ్యక్తులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. అనంతరం జల్సాలు చేసేవారు. వినయ్ పట్టుబడటం తొలిసారి కాగా, రోషన్‌పై గుంటూరు నగరంపాలెం పీఎస్‌లో 2020లో గంజాయి కేసు నమోదైనట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

వ్యాపారాత్మక వ్యవసాయంపై శిక్షణ

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని లాంఫాం విస్తరణ సంచాలకుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల్లోని విస్తరణ శాస్త్రవేత్తలకు, ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా వ్యాపారాత్మక వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వీసీ డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మీదేవి మాట్లాడుతూ రైతు ఉత్పత్తి సంఘాల ఉపయోగాలను వివరించారు. గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వసతుల గురించి చెప్పారు. హైదరాబాద్ అటారిజోన్ టెన్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలన్నీ ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకురాలు డాక్టర్ బి. ప్రమీలారాణి, హైదరాబాద్‌కు చెందిన నారామ్ ఎడ్యుకేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ సెంథిల్‌వినాయగమ్, నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ జి.శరత్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్నమహిపాల్‌రెడ్డి పలు అంశాల గురించి వివరించారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ వీఆర్వో దుర్మరణం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి 12వ సచివాలయ వీఆర్వో ప్రవీణ్ (37) రోడ్డు ప్రమాదంలో గురువారం తెల్లవారుజామున దుర్మరణం పాలయ్యారు. తుళ్ళూరు మండలం, మందడం గ్రామానికి చెందిన ప్రవీణ్ బుధవారం రాత్రి 8 గంటల వరకు విధుల్లోనే ఉన్నట్టు సమాచారం. అనంతరం మందడం వెళ్లాల్సిన ప్రవీణ్ గుడివాడ-మచిలీపట్నం రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. మృతదేహం నుజ్జునుజ్జయింది. ఘటనాస్థలంలో దూరంగా లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా స్థానికులు స్నేహితులు, ఉద్యోగులకు ఫోన్ చేసి చెప్పారు. ప్రవీణ్‌కు ఏడాదిన్నర క్రితమే పెళ్లయింది. ఆయన తండ్రి తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలకు అర్జీలు రాసి పెడుతుంటాడు. కొడుకుకు ఉద్యోగం రావడంతో తమ కష్టాలు తీరతాయని కుటుంబ సభ్యులు భావించారు. ఇంతలోనే ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఇదిలా ఉంటే బుధవారం రాత్రి విధుల అనంతరం మందడం వెళ్లాల్సిన ప్రవీణ్ గుడివాడ-మచిలీపట్నం రోడ్డులోకి ఎందుకు వెళ్లాడనేది ఎవరూ చెప్పలేకపోతున్నారు. ప్రవీణ్ మృతి పట్ల ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, తాడేపల్లి తహసీల్దార్ విజయ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోస్టుమార్టం అనంతరం ప్రవీణ్ మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు.


వీఆర్వో ప్రవీణ్ (ఫైల్)

వ్యవసాయ అధికారుల తనిఖీలు

- రవాణా, పార్సిల్ కార్యాలయాల్లో సోదాలు
- రూ.1.63 లక్షల కలుపు మందులు స్వాధీనం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని నకిలీ, అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సరఫరాను నివారించడంలో భాగంగా అధీకృత డీలర్ పరిసరాలతోపాటు, ఆయా ప్రాంతాల్లో ఉన్న అన్ని రవాణా, పార్సిల్ కార్యాలయాల్లో గురువారం విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. గుంటూరు నగరంలోని మస్తాన్‌దర్గా వద్ద గల క్రాంతి ట్రాన్స్‌పోర్టులో ఎలాంటి బిల్లులూ లేకుండా ఒక వ్యక్తి పేరుపై ట్రైసెల్ కలుపు మందు గుంటూరు రాగా, వ్యవసాయ అధికారులు గుర్తించారు. క్రాంతి ట్రాన్స్‌పోర్టులో రూ.1,14,100 విలువైన 140 లీటర్ల కలుపు మందును గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడులోని పార్సిల్ కార్యాలయంలో రూ.48,900 విలువైన 60 లీటర్ల ట్రైసెల్ కలుపు మందు ఎలాంటి బిల్లులు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 1.63లక్షల విలువైన 200 లీటర్ల కలుపు మందును వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రైసెల్ కలుపు మందును రాష్ట్ర ప్రభుత్వం 2018లో నిషేధించినట్టు వివరించారు. రాష్ట్రంలో ట్రైసెల్‌పై ఉన్న నిషేధం దృష్ట్యా కొంత మంది వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి రహస్యంగా రైతులకు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్టు పేర్కొన్నారు. జిల్లాలో చట్ట వ్యతిరేకంగా నిషేధిత కలుపు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో కమిషనరేట్ జేడీఏ ఎం.విజయభారతి, ఏడీఏ మద్దినేటి, అర్బన్ ఏఓలు బి. గౌతమ్‌ప్రసన్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.


తనిఖీల్లో పట్టుబడిన కలుపుమందు పరిశీలిస్తున్న నున్నా వెంకటేశ్వర్లు, విజయభారతి

హైస్కూల్లో టెన్త్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం గ్రామ పరిధిలోని హైస్కూల్ విద్యార్థిని గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మౌనిక పాఠశాలకు వెళ్లిన అనంతరం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె తీవ్ర అస్వస్థతకు గురవటంతో వెంటనే గమనించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆటోలో స్థానిక పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్య సేవల కోసం 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మౌనిక ఆత్మహత్యాయత్నం గురించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.